# గలగలా గోదారి

—భైరవయ్య

రోడ్డుకి ఒక పక్క కాలవ. మరో పక్కన నాలుగయిదు పాకలు. ఆ పాకల్ని దాటితే వూళ్ళోకి రోడ్డు. అవి పాకలా అంటే, కావురా అబ్బాయ్. ఇప్పటి మీ దృష్టిలో కాకా హోటళ్ళు. అప్పటి ఆ చుట్టుపక్కల వూళ్ళ వాళ్ళ దృష్టిలో ఇప్పుడు మీరు చెప్పుకునే అయిదు నక్షత్రాల హోటళ్ళు. ఆ వూరు- వూరంటే మరీ చిన్నది కాదులే. మూడు వేల గడప వుంటుంది. చాలా పెంకుటిళ్ళు, కొన్ని డాబాలు కూడా వున్నాయి. మార్టేరు నుంచి గూడెంపోయే రోడ్డులో వుందావూరు. రెండు మూడు వేపుల నుంచీ వచ్చే రోడ్లు, ఆ వూరి దగ్గరే కలుస్తాయి. అందువల్ల ఆ వూరు పెరగ డాని కవకాశమొచ్చిందిలే. ఆ వూళ్ళో ఒక టూరింగు టాకీసు కూడా వెలిసింది. బొగ్గు బస్సులు పోయి పెట్రోలు బస్సులొచ్చాయి. ధాన్యం మిల్లు కూడా వుంది. ఒక ఇంగ్లీషు వైద్యం చేసే డాక్టరు కూడా వున్నాడు. స్కూలు కూడా వుంది. మరావూళ్ళో హోటళ్ళుండటంలో ఆశ్చర్యమేముందిరా అబ్బాయ్.

ఆ నాలుగయిదు పాకల్లో మధ్యదాని గురించే నే చెబుతున్నది. అదే పెద్దబ్బాయిది. నీ నాసికాగ్రంధులకి కాస్త పని చెబితే, కమ్మటి నేతి వాసన, ఆ నేతిలో తడిసి వేగిన పెసల వాసన తగలటం లేదురా? నోరూరటంలేదూ. అలా పాక దగ్గర కెళుతోంటే పెనం మీద చుయ్యి మంటున్న చప్పుడు, "ఒరేయ్ పంతులుగారికి వుల్లిపాయొద్దు. అల్లం ముక్కలు, పచ్చిమిర్చి కాస్త బాగా తగలాలి. ఇదిగో గూడెం బస్సు డ్రయివరికి వుల్లిపాయ డబల్ రోస్టు అందియ్యి. డాక్టరు గారికి రెండు స్పెషల్ పెసరా, ఒక డబల్ స్ట్రాంగు కాఫీ పార్శిల్ ..." అంటూ అవధానం చేస్తున్న శాస్త్రీ తాలూకు గొంతు వినిపిస్తుంది. పాక దగ్గర కెళ్ళేసరికి - అలికి ముగ్గులు పెట్టిన నేల, నున్నగా వున్న కడప రాళ్ళు పరిచిన బల్లలు, ఆ బల్లల దగ్గర బెంచీల నిండా జనం, వాళ్ళ ముందు జర్మన్ సిల్వర్ పళ్ళాలలో తామరాకులు, ఆ తామరాకుల్లో నేతి వాసనతో ఘుమ ఘుమలాడుతున్న పెసరట్లు, కొబ్బరి పచ్చడి, అల్లం పచ్చడి దర్శనమిస్తాయి. ఆ బల్లల మధ్య అటు పెనం కేసి వెడుతూ, ఇటు వచ్చిన వాళ్ళని పలకరిస్తూ, అచ్చమైన పాలలా వున్న పళ్ళతో స్వచ్ఛంగా నవ్వుతూ, గూడ కట్టుతో ఓ వ్యక్తి కనిపిస్తాడు చూడు. వాడేరా పెద్దబ్బాయ్. పెసరట్ల పెద్దబ్బాయ్ అని ఆ చుట్టుపక్కల వాసికెక్కిన మహానుభావుడు. పెసరట్టంటే- పెసలు రుబ్బి పెనం మీద కాల్చేయడం కాదని, అదొక కళని, అదొక తపస్సని, ఆంధ్రుడికి తప్ప మరొకడికి చేత కాదని చాటి చెప్పిన వాడు, ఆ పెసరట్ల యజ్ఞంలో ఒక సమిధయి ఆ రుచిని శాశ్వతం చేసినవాడు వాడేరా వాడే. ఆ పెద్దబ్బాయే.

పెద్దబ్బాయ్ స్వచ్ఛమైన వైశ్యకుటుంబంలో

## పెసరట్ల పెద్దబ్బాయి

పుట్టాడురా అబ్బాయ్. తండ్రికి చిల్లర కొట్టుండేది. సహజంగా కలిగిన కుటుంబం కాకపోవడం వల్ల, ఆ చిల్లర కొట్టునే నమ్ముకుని గుట్టుగా సంసారం సాగిస్తూ వుండేవాడు. ఆ వూళ్ళో వున్న వీధి బడిలోనే పెద్దబ్బాయ్ చదువు కున్నాడు. ఆ రోజుల్లో చదువంటే అక్షరమ్ముక్క తెలియడం అన్నమాట. అది కూడా పెద్ద బ్బాయ్‌కి అంతగా పట్టివ్వలేదు. ఎలాగో గుణింతాల వరకు నేర్చుకున్నాడు. ఆ పైన విరమించు కున్నాడు. కొంత కాలం తండ్రితో పాటు చిల్లర కొట్లో కూర్చున్నాడనుకో. అదీ అతనికి వంట బట్టలేదు. కాణీకీ అర్ధణాకీ సరుకులు కట్టివ్వడం, వీశెలు - ఏబులాల కొలతలు విచిత్రంగా వుండేవిరా అబ్బాయతనికి. ఎంత ప్రయత్నించినా ఆ లెక్కలు వంట బట్టేవి కావు. కాణీ సరుకు కట్టాల్సిన చోట అర్థణాకి సరుకు కట్టేవాడు. కొసరి కొసరి కాణీ సరుకు కట్టడం అతనికేమిటోలా వుండేది. కూలీనాలీ జనం ఎక్కువగా వచ్చేవారు ఆ కొట్టుకి. వాళ్ళని చూసి, 'పాపం ఈ కాస్త వాళ్ళకేం సరిపోతుంది' అనుకునేవాడురా పెద్దబ్బాయ్. అందువల్ల, అతనున్నప్పుడు కొట్టు రద్దీగా వుండేది. లాభం మట్టుకు అటకెక్కేది. ఇది చూసి, పెద్ద బ్బాయ్‌ని కొట్లో కూర్చోవద్దన్నాడురా తండ్రి.




ఏం చెయ్యాలా అనే మీమాంసలో పడ్డాడురా పెద్దబ్బాయ్. అప్పటికే వూరికి పట్టణపు వాసనలు తగుల్తున్నాయ్. బొగ్గు బస్సులు తిరుగుతున్నాయ్. నాలుగు వూళ్ళకి కూడలయిందా వూరు. కాలవ దగ్గర రెండు పాకల్లో కాఫీ హోటళ్ళు వెలిశాయి. అదేకదరా నాగరికత.

ఓ రోజు ఏమీ తోచక, ఓ కాఫీ హోటల్లో కెళ్ళాడురా పెద్దబ్బాయ్. లోపలంతా చీదరగా వుంది. బురద బురదగా వుంది. చెక్క బల్లలు మాసికలుకట్టి వున్నాయ్. సత్తు ప్లేట్లు సరిగ్గా కడిగి లేవు. సత్తు గ్లాసులు కూడా శుభ్రంగా లేవు. పెసరట్టు తెమ్మన్నాడురా పెద్దబ్బాయ్. వచ్చిన పెసరట్టు అతనికి గుండెల్లో దేవినట్టుగా వుంది. కాఫీ, మరగబెట్టిన బురదనీళ్ళు తాగినట్టుగా వుంది. తల పంకించాడురా పెద్ద బ్బాయ్.

ఎలా పట్టుబడిందో, పెద్దబ్బాయ్‌కి వంట పట్టుబడిందిరా. అతను ఎడం చేత్తో వేసినా, ఆ పదార్థానికి ఒక రుచి, ఒక సువాసన ప్రత్యేకంగా వుండేవిరా. ఆమడదూరం నుంచే, ఆ గుబాళింపు నోట్లో లాలాజలం వూరించేదిరా. అందులో పెసరట్టన్నా, కాఫీ అన్నా ప్రత్యేకమైన అభిమానం పెద్దబ్బాయ్‌కి. 'పెసరట్టు ఆంధ్రుడి సొత్తండి. ప్రపంచంలో ఎవడికీతరం కాదండి, ఆంధ్రుడిలా పెసరట్టెయ్యడం. నీళ్ళు మరగబెట్టి కాఫీ గుండ పోసెయ్యడం కాదండి కాఫీ అంటే. అత్తిలిలో కాఫీ కాస్తే గూడెంలో దాని సువాసన తెలియాలండి .ఆదండి కాఫీ అంటే' అనేవాడురా పెద్దబ్బాయ్.

అటువంటి పెద్దబ్బాయ్, తనుకూడా ఓ కాఫీ హోటలు పెట్టి, అచ్చమైన నేతి పెసరట్లు, స్వచ్ఛమైన కాఫీ అందజేసి తెలుగు తల్లి రుణం తీర్చుకోవాలనుకున్నాడురా.

కాలువ దగ్గర కొత్తపాక లేచిందిరా అబ్బాయ్. నేలంతా చదును చేసి, పేడతో అలికి ముగ్గులు పెట్టాడురా పెద్దబ్బాయ్. కర్రబల్లలు చేయించి, వాటి మీద నున్నటి కడపరాళ్ళు పరిపించాడురా. కూచోడానికి బెంచీలు చేయించాడు. జర్మన్ సిల్వర్ ప్లేట్లు, గ్లాసులు తెప్పించాడు. కాఫీ కోసం, చెన్న పట్టణం నుంచి ఇత్తడి గ్లాసులు, గిన్నెలు తెప్పించాడు. ఎప్పటికప్పుడు తామరాకులు తెప్పించి వుంచుకునేవాడు.

''మన దగ్గర భోంచేసాక మరో దేదీ రుచించకూడదండి'' అన్నది పెద్దబ్బాయ్ ఆశయంరా అబ్బాయ్.

అలా పెద్దబ్బాయ్ హోటలు ప్రారంభమయింది. ముందు గునిసినా, 'పోన్లే, ఇదైనా వాడికచ్చొస్తేచాలు' అని సరిపెట్టుకున్నాడురా తండ్రి.

హోటలు ప్రారంభించిన పది రోజుల్లోనే పెద్దబ్బాయ్ పెసరట్టు పరిమళం పదివూళ్ళకీ వ్యాపించింది. 'ఈ వేళ పెద్దబ్బాయ్ హోటల్లో కాఫీ తాగుదావేమిటి' అనే స్థితికి పది వూళ్ళ జనం వచ్చేశారు. ఆ చుట్టుపక్కలకెవ రొచ్చినా, పెద్దబ్బాయ్ హోటల్లో పెసరట్టు తిని కాఫీ తాగివెళ్ళడం, అతి జరూరు పనుల్లో ఒకటై పోయింది. ముఖ్యమైన చుట్టాలు కాని, స్నేహితులు కాని వస్తే, సైకిళ్ళ మీద మనుషుల్ని తరిమి, పెద్దబ్బాయ్ హోటల్నుంచి పెసరట్లు తెప్పించి పెట్టడం ఒక ఘనమైన సత్కారమే. మెయిలు బస్సైనా సరే, 'పాసింజర్లు పెద్దబ్బాయ్ హోటల్లో పెసరట్టు భోంచేస్తున్నారంటే ఆగిపోవలసిందే. తాసీల్దారైనా, రెవిన్యూ అధికారైనా పెద్దబ్బాయ్ హోటల్లోంచి వచ్చిన పెసరట్టు తిని, కాఫీ తాగాక శిస్తు బకాయి సంగతి మర్చిపోవలసిందే వాళ్ళు కావాలనే మర్చిపోయేవారులే. ఎన్నిసార్లొస్తే అంతమంచిది. శిస్తు వసూలు చేసేస్తే పెద్దబ్బాయ్ పెసరట్లు దొరకడం మానేస్తుంది కదరా.

ఇంతకీ పెద్దబ్బాయ్ పెసరట్టు ప్రత్యేకతేమిటంటావా వుందిరా. లేకపోతే ఈ సోదంతా దేనికి.

నాణ్యమైన పెసలు వెతికి మరీ కొనేవాడురా. కొన్నాక వాటిని ఎండబెట్టి, నూనె రాసి, రాయీ బెడ్డా మచ్చుక్కూడా లేకుండా ఏరించేవాడు. వాటిని నానబెట్టి భోషాణం లాంటి రోలులో వెన్న ముద్దలాగా రుబ్బించే వాడు. అతనికి నచ్చుబాటయ్యేటంత వరకు ఆ పెసలు అలా నలగాల్సిందే. అందులో ఉప్పు పెద్దబ్బాయే వెయ్యాలి. ఎప్పుడూ రవ్వంత ఎక్కువ వడం కాని, తక్కువవడం కాని జరిగేది కాదు. ఆ ముద్దని తీసుకుని కాలుతున్న పెనంమీద నెయ్యిరాసి స్వయంగా వేసేవాడు. నెయ్యంటే అచ్చంగా నెయ్యే. ప్రత్యేకంగా వెన్న కొని, తమలపాకు, ఏలక్కాయపొడి వేసి కాచే వాడు. ఆ నేతితో పెసరట్టేశేవాడు. దాని మీద సన్నగా తురిమిన పచ్చి మిరపకాయ, అల్లం, కావలసిన వాళ్ళకి వుల్లిపాయ ముక్కలు అద్దేవాడు. అందులోకి కేవలం కొబ్బరికాయతో చేసిన పచ్చడీ, అల్లం పచ్చడీ వేసేవాడు.

## హృదయభక్షి

నేత్రారణ్యాల చీకట్లలో పొంచి
యాత్రికుడి కోసం కాచి
వుంటుంది ఆడది.

పుట్టక పూర్వమే
పోగొట్టుకున్న దేదో
వెతుక్కుంటూ వెడతావు నువ్వు

ఆమె శరీరపు
స్వర్ణ సైకతాలూ,
గలగల పారే
నవ్వుల సెలయేళ్ళూ,
నేత్రారణ్యాల పైన
ఆకాశపు నీలిమలూ
ఆకర్షిస్తాయి నిన్ను.

'నిన్ను ప్రేమిస్తున్నా' నంటావు
నోరు తెరిచి.

ఆ అదను కోసమే
ఎదురు చూస్తున్న ఆడది
గబుక్కున చేయి చాపి
గొంతుకలోకి పోనిచ్చి
గుండెకాయను తెంపి
సర్రున బైటికి లాగి
కరకరా నమిలేస్తుంది.

ఆమె సమాధానం కోసం
ఆతృతగా చూస్తుంటావు.
నీకు గుండె లేదనీ,
నీవు శవానివనీ
ఇంకా నీకు తెలీదు.

—ఇస్మాయిల్

పెసరట్టు అలా పెనం మీద పడగానే, ఇవతల జనం ఆగలేక పోయేవారనుకో. జఠరాగ్ని బడబానలంలా రగిలి పోయేది. తినడనే లక్ష్యం కానీ, ఎన్ని అనే ధ్యాస అటు జనానికి, ఇటు పెద్దబ్బాయికీ కూడా వుండేది కాదు.

కాఫీయా? అదొక కళరా అబ్బాయ్. నీలగిరి నుంచి గింజలు తెప్పించేవాడు ఒకటో నెంబరువి. వాటిని స్వయంగా వేయించి, ఏరోజు కారోజు సొంతంగా ఆడించి, అప్పటికప్పుడు ఫిల్టర్ డికాషన్ తీసేవాడు. అందులో నీటి చుక్క తగలని పాలు పోసేవాడు. నీటి చుక్క తగిలిందని ఏ మాత్రం అనుమాన మొచ్చినా ఆ రోజు కాఫీ దొరికేది కాదు పెద్దబ్బాయ్ హోటల్లో.

'ఇంతకీ డబ్బు లేవన్నా చేసుకున్నాడా' అంటావా. అదేం ప్రశ్నరా చచ్చు ప్రశ్న. పెట్టడంలోనే ఆనందం పొందేవాడురా పెద్దబ్బాయ్. వచ్చిన వాళ్ళు - నోరు చెయ్యి తోటీ, చెయ్యి నోటి తోటీ పోటీ పడుతూ వుండగా తిన్నన్ని పెసరట్లు తిని , ఆరమూతలడ్డ కళ్ళతో ఆరారగా కాఫీని వంట పట్టించుకుంటూ వుంటే, ఆ ఆనందమంతా పెద్దబ్బాయ్‌దేకదరా. మధ్యలో అప్రస్తుత విషయాలు దేనికిరా అబ్బాయ్.

తెలిసిందా వాడురా పెసరట్ల పెద్దబ్బాయంటే. ఇప్పుడా పెద్దబ్బాయీ లేడు. ఆ పెసరట్లూలేవు. ఆ పెసరట్ల వాసన మటుకు ఆ పదివూళ్ళనీ, ఇప్పటికీ వదల్లేదురా అబ్బాయ్. ఆ తరంవాళ్ళు ఇంకా కొందరు వున్నారులే. వాళ్ళు ఆ పెసరట్ల రుచి వర్ణిస్తూ వుంటే, నేటి కుర్రకారుకి వుడుకుమోత్తనం వచ్చేస్తువుంటుందిలే. కాలపురుషుడి చెవి పట్టుకుని, వెనక్కి తీసి కెళిపోదామని అనుకుంటూ వుంటారు పాపం.

*